# నిట్‌లో ఉద్యోగాల పేరిట మోసం

**ఐదుగురి నుంచి రూ.21లక్షలు వసూలు**

**ప్రైవేట్ టీచర్‌పై కేసు నమోదు**




సుబేదారి, జనవరి 31 : ఉద్యోగాల పేరిట మోసం చేసి వసూళ్లకు పాల్పడిన వ్యక్తిపై బుధవారం హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ రెడ్డికాలనీకి చెందిన లెంకల వివేకానందరెడ్డి అదే ప్రాంతంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. వరంగల్ నిట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని అదే స్కూల్‌లోని ఐదుగురి టీచర్ల నుంచి రూ.21లక్షలు వసూలు చేశాడు. ఈమేరకు బాధితులు ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


సమ్మక్క దేవత గద్దెను దర్శించుకుంటున్న భక్తులు


ప్రగతిసింగారం గ్రామపంచాయతీ కార్యాలయం

గ్రామ పంచాయతీల్లో మళ్లీ ప్రత్యేకాధికారుల పాలన రానుంది. నేటితో ప్రస్తుత పంచాయతీ పాలక వర్గాల గడువు ముగియనుండడంతో పల్లెల పాలన అధికారుల చేతుల్లోకి వెళ్లనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా లేకపోవడంతో పదేళ్ల తర్వాత మళ్లీ గ్రామాల్లో ప్రత్యేక పాలన ప్రారంభం కానుంది. ఇప్పటికే జిల్లా యంత్రాంగం విభాగాల వారీగా అధికారులను గుర్తించే పనిలో నిమగ్నమైంది. కాగా, మళ్లీ ప్రత్యేకాధికారుల పాలన వస్తే గ్రామాల అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉన్నదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

– హనుమకొండ, జనవరి 31

# పంచాయతీల్లో ప్రత్యేక పాలన

**నేటితో ముగియనున్న పాలకవర్గాల గడువు**

**పదేళ్ల తర్వాత మళ్లీ స్పెషలాఫీసర్లు**

**కసరత్తు చేస్తున్న అధికార యంత్రాంగం**

**అభివృద్ధి కుంటుపడుతుందని ప్రజల అసహనం**

పంచాయతీల పాలక మండలి గడువు పూర్తవుతున్న నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర సర్కారు సుముఖంగా లేదు. 2019 ఫిబ్రవరి నెలలో కొలువుదీరిన పాలకవర్గాల పదవీ కాలం ఫిబ్రవరి ఒకటో తేదీతో ముగియనుంది. గడువు తీరేలోపు ఎన్నికలు నిర్వహించాలి. కానీ పార్లమెంట్ ఎన్నికల అనంతరం పంచాయతీల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయంతో హనుమకొండ జిల్లాలోని 208 జీపీలు, వరంగల్ జిల్లాలోని 323, మహబూబాబాద్ జిల్లాలోని 461, జనగామ జిల్లాలోని 281, ములుగు జిల్లాలోని 173, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 241 పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అధికారులను గుర్తించి మండలాల వారీగా జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. తహసీల్దార్, ఎంపీడీవో, పీఆర్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ ఏఈలు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఎంపీవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో కూడిన జాబితాను రూపొందించినట్లు తెలిసింది. వీరికి నేడో రేపో గ్రామ పంచాయతీల పాలన బాధ్యతలు అప్పగించనున్నారు. అయితే గతంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను ఎప్పుడూ వాయిదా వేయలేదని, గడువులోగా ఎన్నికలు నిర్వహించే వారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ప్రత్యేకాధికారుల పాలన ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



### ఏర్పాట్లు చేస్తున్నాం

ఫిబ్రవరి ఒకటో తేదీతో పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియనుంది. గ్రామాల్లో పాలనకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వ మౌఖిక ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వ సూచనల మేరకు అధికారులను గుర్తించి జాబితాను సిద్ధం చేశాం. ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే అధికారులకు ఆర్డర్స్ అందజేస్తాం.

– వీ జగదీశ్వర్, డీపీవో, హనుమకొండ

# తల్లుల దీవెనల కోసం బారులు

**ముందస్తు మొక్కులతో రద్దీగా మారుతున్న మేడారం.. అమ్మవార్ల దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు**


అమ్మవార్ల గద్దెల వద్ద బారులు తీరిన భక్తులు

తాడ్వాయి, జనవరి 31 : ఆదివాసీ దైవాలు సమ్మక్క-సారలమ్మ దర్శనానికి భక్తులు బారులు తీరుతున్నారు. మహా జాతరకు మరో 20 రోజుల సమయం ఉన్నప్పటికీ ముందస్తు మొక్కులు చెల్లిస్తున్నారు. దీంతో గద్దెలు, మేడారం పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి తలనీలాలు సమర్పించి గద్దెల వద్దకు చేరుకుని పసుపు, కుంకుమ, ఎత్తు బెల్లం సమర్పించారు. గద్దెల పరిసరాలతో పాటు చిలకలగుట్ట, జంపన్నవాగు తదితర ప్రాంతాల్లో విడిది చేశారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు.


ధర్మారెడ్డికి ప్రసాదం అందిస్తున్న పూజారులు

### కొబ్బరి నీళ్లతో చిత్తడిగా తల్లుల ప్రాంగణం

గద్దెల ప్రాంగణంలో కొబ్బరి కాయలు కొట్టేందుకు స్టాండ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో నీటితో చిత్తడిగా మారుతోంది. బెల్లం, ఒడిబియ్యంతో పాటు కొబ్బరి నీళ్లు గద్దెల వద్ద పారుతుండటంతో మిశ్రమంగా మారి భక్తుల కాళ్లకు అంటుకుని జాతర పరిసరాలు మొత్తం వ్యాపిస్తున్నది. దీంతో ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి. అయినా దేవాదాయశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.


అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ


ఇంకా ప్రారంభం కాని కల్యాణకట్ట మరమ్మతులు

# గడువు ముగిసింది.. పనులు పూర్తి కాలె..

**మేడారంలో నత్తనడకన అభివృద్ధి పనులు.. మంత్రులు సమీక్షించినా ఫలితం శూన్యం**

**వారి ఆదేశాలను బేఖాతరు చేసిన అధికారులు.. ముందస్తు భక్తులకూ తప్పని తిప్పలు**




కందకాల దశలోనే ఉన్న మరుగుదొడ్లు

తాడ్వాయి, జనవరి31 : మహా జాతరను పురస్కరించుకుని మేడారం పరిసరాల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడివి అక్కడే ఉన్నాయి. మంత్రులు సీతక్క, కొండా సురేఖ పలుమార్లు మేడారంలో పర్యటించి సమీక్షలు నిర్వహించి జనవరి 31లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించడంతో కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అయినప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని శాఖల పనులు 50 శాతం మాత్రమే పూర్తికాగా, మరి కొన్ని పునాదుల దశలోనే ఉన్నాయి. దీంతో జాతర సమయానికి భక్తులకు సౌకర్యాలు అందుతాయా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కల్యాణకట్టల మరమ్మతులు కొనసాగుతున్నాయి. ఐబీ శాఖ చేపట్టిన ఇన్ ఫిల్టరేషన్ బావుల పూడికతీత పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో చేపట్టిన తాడ్వాయి–మేడారం బీటీ రెన్యువల్ పనులు సాగుతున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ చేపట్టిన తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శివరాంసాగర్ చెరువు సమీపంలోని మరుగుదొడ్లకు ఇంకా బేషన్లు కూడా బిగించలేదు. కొంగలమడుగు ప్రాంతంలో అయితే కేవలం కందకాలు తీసి వదిలేశారు. వాటి పనులు ఇంకా ప్రారంభించనేలేదు. అధికారుల అలసత్వంతో కోట్లాది రూపాయలతో పనులు చేపడుతున్నా సౌకర్యాలు కేవలం నాలుగు రోజుల పాటు మాత్రమే భక్తులకు ఉపయోగపడేలా కనిపిస్తుంది. పనుల్లో వేగం పెంచకుండా అధికారులు మంత్రుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ముందస్తుగా వచ్చే భక్తులు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.


వివరాలు తెలుసుకుంటున్న ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

# బిల్ట్ ఫ్యాక్టరీని పరిశీలించిన కలెక్టర్

మంగపేట, జనవరి 31 : మండలంలోని కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీని బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి సీనియర్ మేనేజర్ ప్రసాద్‌నాయర్‌తో కలిసి పరిశీలించారు. పరిశ్రమ లోపల స్థలంతో పాటు, కార్మికులు నివాసముండే కాలనీ, గోదావరి తీరంలోని ఇన్‌టేక్‌వెల్, ఫ్యాక్టరీ అనుబంధ పాఠశాల, సరిహద్దులను రెవెన్యూ, పంచాయతీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో చేసిన సర్వే నివేదికను పరిశీలిస్తూ ఫ్యాక్టరీకి సంబంధించి మొత్తం స్థలం ఎంత? సర్వే నంబర్ల వివరాలను తెలుసుకున్నారు. ఫ్యాక్టరీ మూతపడినప్పటికీ అసౌకర్యాల మధ్య నడుస్తున్న థాపర్ విద్యావిహార్ పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. ఆమె వెంట ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, తహసీల్దార్ వీరస్వామి, ఎంపీడీవో ఆలేటి సుదర్శన్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్‌ఐ కుమారస్వామి ఉన్నారు.

### పన్ను బకాయిలు చెల్లించాలి

కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీ, కార్మికుల కాలనీకి సంబంధించి పన్ను బకాయిలు చెల్లించాలని గ్రామ పంచాయతీ అధికారులు బుధవారం బిల్ట్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. క్వార్టర్స్ పన్ను రూ.85,84,507, ఫ్యాక్టరీ పన్ను రూ.1,50,59,992 కలిపి మొత్తం రూ.2,36,44,499 సకాలంలో చెల్లించని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసులో తెలిపారు.

